# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక


## విద్యార్థుల ప్రతిభ సూపర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేసే విద్యార్థుల ప్రతిభ బాగుందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ప్రశంసించారు. శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో రాజ్‌భవన్ స్కూల్ నుంచి టీఐఇ యంగ్ ఎంటర్ ప్రిన్యూర్‌షిప్‌కు ఎంపికైన 10 మంది విద్యార్థుల ఆవిష్కరణల ప్రదర్శనను ఆమె తిలకించారు. ఈ మిగతా 2లో...


RANGAREDDY, EDITION : 01, VOLUME :144 EDITOR:CHERUKU UPENDAR, DATE : SUNDAY 08 OCTOBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 144 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 08 అక్టోబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


### ఆసియా క్రీడల్లో

## భారత్ నయా చరిత్ర

- 28 బంగారు, 38రజత, 41 కాంస్యాలతో 107 పతకాలు
- చివరిరోజు 6 స్వర్ణాలు
- నేటితో ముగియనున్న 19వ ఆసియా క్రీడలు



**హాంగ్జౌ - ప్రభాత సూర్యుడు:** 19వ ఆసియా క్రీడల్లో భారత్ నయా చరిత్ర నెలకొల్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రికార్డు స్థాయిలో 107 (28 స్వర్ణాలు, 38 రజతాలు, 41 కాంస్యాలు) మిగతా 2లో...

## సిక్కిం వరదలు.. పెరుగుతున్న మరణాలు

**సిక్కిం-ప్రభాత సూర్యుడు:** సిక్కింలో సంభవించిన ఆకస్మిక వరదల మృతుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. వరదల్లో చిక్కుకుని మరణించిన వారి సంఖ్య 53కి చేరింది. చనిపోయిన వారిలో ఏడుగురు జవాన్లు కూడా ఉన్నారు. ఇక పొరుగున్న ఉన్న పశ్చిమబెంగాల్‌లోని తీస్తా నదిలో ఇప్పటివరకు 26 మృతదేహాలు లభ్యమైనట్లు శుక్రవారం విడుదల చేసిన సిక్కిం రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ (ఎస్ఎస్‌డిఎంఎ) నివేదిక పేర్కొంది. ఇంకా 142 మంది గల్లంత య్యారని ఈ నివేదిక మిగతా 2లో...



PTI

### ఆ రెండు పార్టీలది

## ఫెవికాల్ బంధం

- కేసీఆర్ పక్కాగా ప్రధాని మోదీ ఏజెంట్
- ఒవైసీ.. సోనియాను తిడితే భారీ మూల్యం
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- తెలంగాణ అభివృద్ధి ఒక ఇంటిలోనే..
- మత స్వేచ్ఛను అణచివేస్తున్న మోదీ
- భయంలో మైనారిటీలు: పి.చిదంబరం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

"రాష్ట్రంలో హంగ్ వస్తుందని, బీజేపీ మద్దతుతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఆ పార్టీ ముఖ్యనేత బీఎల్ సంతోష్ అన్నారు. కానీ, కాంగ్రెస్, బీజేపీ ఎప్పటికీ ఒకటి కావు. ఈ విషయం అందరికీ తెలుసు. అంటే.. హంగ్ వస్తే కలవబోయేది బీఆర్ఎస్, బీజేపీయేనని బీఎల్ సంతోష్ చెప్పకనే చెప్పారు" అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. హంగ్ వస్తే బీఆర్ఎస్ ప్రభుత్వంలో బీజేపీ తప్పకుండా భాగస్వామి మిగతా 2లో...

## తెలంగాణ అంతటా..

## కాంతితో క్రాంతి





- చంద్రబాబు అక్రమ అరెస్టుకు కొవ్వొత్తుల ర్యాలీలు
- జిల్లాల్లో కొనసాగుతున్న దీక్షలు
- ఢిల్లీలో నిరసనలో పాల్గొన్న లోకేశ్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పిలుపు మేరకు శనివారం 'కాంతితో క్రాంతి' కార్యక్రమాన్ని తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించారు. కొవ్వొత్తుల ర్యాలీల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలు సైతం స్వచ్ఛందంగా పాల్గొన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ రాత్రి 7 గంటల ప్రాంతంలో లైట్లు ఆపేసి, ఐదు నిమిషాల పాటు కొవ్వొత్తులు వెలిగించి మద్దతు తెలిపారు. పార్టీలకు అతీతంగా పలువురు నేతలు కూడా టీడీపీ నిరసన ర్యాలీలకు సంఘీభావం తెలిపారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని జెక్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, నందమూరి రామకృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి పెద్దోజు రవీంద్రచారి తదితరులు కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. అంతకుముందు జెక్ కాలనీలో గాంధీ మిగతా 2లో...

## నకిలీ సర్టిఫికెట్ల గోల్ మాల్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారంలో నకిలీ స్థానిక ధృవీకరణ పత్రాల వ్యవహారం కలకలం రేపుతోంది. నకిలీ ధృవపత్రాలతో అక్రమంగా ఎంబిబిఎస్ సీట్లను పొందిన ఏడుగురు విద్యార్థులపై తెలంగాణ పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరి అడ్మిషన్లను రెండు రోజుల క్రితం కాళోజీ యూనివర్శిటీ రద్దు చేసింది. వీరిలో కొందరిని ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఏపీకి చెందిన పోపులు సుబ్రహ్మణ్య సాయితేజ, వానిపెంట సాయిప్రీతికారెడ్డి, తమ్మినేని విష్ణుతేజారెడ్డి, తన్నీరు సంజయ్, అరికట్ల హనుమాన్ రెడ్డి, టేకులపల్లి మహేష్, గేర్లె భార్గవ్ ధర్మతేజ, యశ్వంత్ నాయుడులను అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. తప్పుడు ధృవీకరణ పత్రాలు రూపొందించిన కన్సల్టెన్సీ నిర్వాహకుడు కామిరెడ్డి నాగేశ్వరరావును కూడా మిగతా 3లో...

## రేవంత్‌రెడ్డి..రేటెంతరెడ్డి

- ఇష్టారీతిన టికెట్లు అమ్ముకుంటుండు
- ఎన్నికలయ్యాక కాంగ్రెస్‌కు ధోకా..
- 10 మంది ఎమ్మెల్యేలతో బీజేపీలోకి
- కాంగ్రెస్ పార్టీకి కర్ణాటక...
- బీజేపీకి గౌతమ్ అదానీ ఫండింగ్
- కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌కు రికార్డు విజయం: కేటీఆర్
- నియోజకవర్గంలో శంకుస్థాపనలు సభ అనంతరం స్వల్ప అస్వస్థత



కామారెడ్డి - ప్రభాత సూర్యుడు

తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బయటి నుంచి వచ్చిన వాళ్లకు అడ్డగోలుగా కోట్లకు సీట్లు అమ్ముకుంటున్నాడని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఆయన చేతిలో మోసపోయి, బీఆర్ఎసలోకి వస్తున్న కాంగ్రెస్ నేతలే స్వయంగా ఈ విషయం చెప్పారన్నారు. ఆ పార్టీలో రేవంత్‌రెడ్డిని రేటెంతరెడ్డి? అని పిలుస్తున్నారని ఎద్దేవా చేశారు. శాసనసభ ఎన్నికలు కాగానే రేవంత్ గెలిచే పది పన్నెండు మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో బీజేపీలోకి జంప్ అవడం ఖాయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. రేవంత్‌ను కాంగ్రెసలోకి పంపింది ఆరెస్సెస్సేనన్నారు. గతంలో రేవంత్ ఆ సంస్థ కార్యకర్తగా పని చేశారని చెప్పారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలతో ఆయనకు చీకటి ఒప్పందాలు ఉన్నాయని కేటీఆర్ ఆరోపించారు. శనివారం ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న కామారెడ్డి అసెంబ్లీ నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన మిగతా 2లో...

## ఇక మహిళా లోకానికి మంచిరోజులు

### - మహిళా బిల్లుకు కృషి చేసిన దేవే గౌడ, సోనియా, మోడీకి కృతజ్ఞతలు



**హైదరాబాద్-ప్రభాతసూర్యుడు :** దేశంలో మహిళా రిజర్వేషన్ల చట్టం వచ్చిన నేపథ్యంలో భవిష్యత్తులో మహిళలకు మంచి రోజులు వస్తాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. మహిళా బిల్లు కోసం కృషి చేసిన మాజీ ప్రధాని దేవే గౌడ, సోనియా గాంధీ, ప్రధాని నరేంద్ర మోడీకి ఆమె కృతజ్ఞతలు చెప్పారు. లండన్‌లోని పబ్లిక్ పాలసీకి సంబంధించిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ బ్రిడ్జ్ ఇండియా "మహిళా రిజర్వేషన్లు ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం" అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో మిగతా 3లో...

# విద్యార్థుల ప్రతిభ సూపర్

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడి జీవితంలో ఉన్నతంగా ఎదిగిన వారికి సంబంధించిన విషయాలు తెలుసుకోవడం విజయానికి దోహదం చేస్తాయని సూచించారు ఈ కార్యక్రమంలో టీఐఇ హైదరాబాద్ ఛార్టర్ మెంబర్లు ఎన్.వెంకటేష్, భాను ప్రకాష్ వర్మ, రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ వి.ఏ.ఎస్.కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# సిక్కిం వరదలు.. పెరుగుతున్న మరణాలు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. ఈ వరదల కారణంగా 2,413 మందిని రెస్క్యూ సిబ్బంది రక్షించారని, సుమారు 1203 ఇళ్లు దెబ్బతిన్నాయని ఈ ఎస్ఎస్‌డిఎంఎ నివేదిక తెలిపింది. ఈ వరదల వల్ల సుమారు 25,065 మంది ప్రజలు ప్రభావితమయ్యారు. 6875 మంది 22 సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారని సిక్కిం విపత్తు నిర్వహణ శాఖ పేర్కొంది. వరదల కారణంగా 13 వంతెనలు వరదలో కొట్టుకుపోయాయని, ఉత్తర సిక్కింలో కమ్యూనికేషన్‌కు అంతరాయం ఏర్పడినట్లు ఎస్ఎస్‌డిఎంఎ నివేదిక తెలిపింది.

**సీఎం ఉన్నతస్థాయి సమావేశం**

వదరల నేపథ్యంలో సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ శుక్రవారం సాయంత్రం ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులపై సమీక్షించారు. చుంగ్‌తంగ్ వరకు రోడ్డు కనెక్టివిటీని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని సిఎం అధికారులను ఆదేశించారు. నాగా నుంచి టూంగ్ వరకు వీలైనంత త్వరగా రహదారిని నిర్మించాలని పేర్కొన్నారు. వరదల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ. 4 లక్షల పరిహారం ప్రకటించారు.

# ఆసియా క్రీడల్లో భారత్ నయా చరిత్ర

(మొదటిపేజీ తరువాయి)

అత్యధిక పతకాలను సాధించింది. 'సెంచరీ' పతకాలే లక్ష్యంగా ఈ క్రీడల బరిలోకి దిగిన భారత్ ఆ ఫీట్‌ను అందుకోవడం హర్షించదగ్గ విషయం. ఇక ఇండోనేషియా వేదికగా 2018లో జరిగిన జకార్తా ఆసియా క్రీడల్లో భారత్ 70(16స్వర్ణ, 23రజత, 31కాంస్య) పతకాలతో 8వ స్థానంలో నిలువగా.. ఈసారి 107పతకాలతో నాల్గో స్థానానికి ఎగబాకింది. ఇక చైనా 382 పతకాలతో (200స్వర్ణాలు, 111రజతాలు, 71కాంస్యాలు) అగ్రస్థానంలో నిలువగా.. జపాన్ 186 పతకాలు (51 స్వర్ణాలు, 66 రజతాలు, 69 కాంస్యాలు), ద. కొరియా 190 పతకాలు (42 స్వర్ణాలు, 59 రజతాలు, 89 కాంస్యాలు) టాప్–3లో నిలిచాయి.

చివరి రోజు భారత్‌కు ఏకంగా 6 స్వర్ణ పతకాలు దక్కాయి. కబడ్డీలో మహిళల, పురుషుల జట్లు, పురుషుల క్రికెట్, బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్‌లో చిరాగ్–సాత్విక్, కాంపౌండ్ ఆర్చరీలో ప్రవీణ్ ఓజాస్, వ్యక్తిగత విభాగంలో వెన్నం జ్యోతి సురేఖ స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. అలాగే ఆర్చరీలో అభిషేక్ వర్మ రజత, అదితి కాంస్య పతకాలను చేజిక్కించుకున్నారు. మహిళల హాకీ జట్టు 2–1 గోల్స్ తేడాతో జపాన్‌ను ఓడించి కాంస్య పతకాన్ని ముద్దాడగా.. రెజ్లింగ్‌లో దీపక్ పునియా ఫైనల్లో ఓడి రజత పతకానికే పరిమితమయ్యాడు. శనివారం మహిళల కబడ్డీ జట్టు ఫైనల్లో చైనీస్ తైపీని ఓడించి స్వర్ణ పతకాన్ని సాధించడం ద్వారా ఈ ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన పతకాల సంఖ్య 100 మార్క్‌కు చేరింది.

**ప్రముఖుల శుభాకాంక్షలు..**

ఈసారి ఆసియా క్రీడల్లో వందకు పైగా పతకాలు సాధించిన భారత అథ్లెట్లకు భారత ప్రధాని నరేంద్ర మోడీతో పాటు పలువురు ప్రముఖులు ట్విటర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. అద్భుత ప్రదర్శన కనబర్చిన అథ్లెట్లకు ఆతిథ్యమివ్వాలని, వారితో సంభాషించేందుకు ఆతృతతో ఎదురుచూస్తున్నానని ప్రధాని ట్వీట్ చేయగా.. సెంచరీ పతకాలే లక్ష్యంగా వెళ్లిన అథ్లెట్లు ఆ ఫీట్ చేరుకోవడం హర్షిందగ్గ విషయమని క్రీడల శాఖమంత్రి అనురాగ్ ఠాకూర్ పేర్కొన్నారు. ఈసారి ఆసియా క్రీడల్లో నయా చరిత్ర సృష్టించారని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ట్వీట్‌లో పేర్కొనగా.. సెంచరీ మార్క్‌ను అందుకోవడంలో మహిళా అథ్లెట్లు కీలకపాత్ర పోషించారని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ట్వీట్‌లో అథ్లెట్లకు శుభాకాంక్షలు తెలిపారు.

# సీపీఎస్‌ను రద్దు చేయండి

## -మంత్రి కేటీఆర్‌కు టీఎస్‌సీపీఎస్‌ఈయూ నివేదిక



**హైదరాబాద్-ప్రభాతసూర్యుడు :** రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) డిమాండ్ చేసింది. రాష్ట్రంలో మూడు లక్షల మంది ఉద్యోగుల కుటుంబాలు దీనికోసం ఎదురుచూస్తున్నాయని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే నిర్ణయం తీసుకోవాలని కోరింది. శనివారం హైదరాబాదులో ఐటీ, పురపాలక శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ కలిసి సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం అమలుపై సంపూర్ణ నివేదికను అందించారు. సీపీఎస్ రద్దు చేసిన రాష్ట్రాల్లో పాత పెన్షన్ అమలవుతున్న తీరును మంత్రి వారిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు ముఖ్యమంత్రి కేసీఆర్ సీపీఎస్‌పై సత్వర నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ప్రతి ఏటా రూ.రెండు వేల కోట్లు షేర్ మార్కెట్‌లోకి వెళ్తున్నాయని వివరించారు. పాత పెన్షన్ అమలు వల్ల ఇప్పటికిప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి నయా పైసా భారం ఉండబోదని స్పష్టం చేశారు. సీపీఎస్ రద్దుపై ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ కోశాధికారి నరేష్‌గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రావు పాల్గొన్నారు.

# ఆ రెండు పార్టీలది ఫెవికాల్ బంధం

(మొదటిపేజీ తరువాయి)

అవుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా చూసేందుకు ఆ రెండు పార్టీలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ గెలిచే పరిస్థితి లేకున్నా మోదీ తిరుగుతున్నాడని, బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకు కుట్ర చేస్తున్నారని వ్యాఖ్యానించారు. వారి కుట్రలకు పడిపోకుండా క్రైస్తవులు, ఇతర మైనారిటీలు కర్ణాటక మాదిరిగా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. శనివారం సికింద్రాబాద్‌లో జరిగిన క్రైస్తవుల సమావేశంలో కాంగ్రెస్ ముఖ్యనేత చిదంబరంతో పాటు రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సదర్భంగా రేవంత్ మాట్లాడుతూ, కర్ణాటకలో జేడీఎస్ పాత్రను తెలంగాణలో బీజేపీ పోషించాలని ఆశిస్తోందని అన్నారు. ప్రజలు తాము ఎన్నుకున్న ప్రభుత్వంలోనే భయంభయంగా బతికే పరిస్థితి దేశంలో, రాష్ట్రంలో ఏర్పడిందని రేవంత్‌రెడ్డి అన్నారు. తాము అధికారానికి వస్తే క్రైస్తవ సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కర్ణాటక మైనారిటీల్లో 88 శాతం ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు నిలబడ్డారని రేవంత్ ప్రస్తావించారు. దాంతో ఆ రాష్ట్రంలో మైనార్టీ సంక్షేమం కోరే ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం కలిగిందన్నారు. తెలంగాణలోనూ మైనారిటీలు కాంగ్రెసకు 90 శాతం అండగా నిలవాలని కోరారు. కేసీఆర్, కేటీఆర్ ఇద్దరూ సోనియాను దూషిస్తున్నారని, మరోపక్క బీజేపీ కూడా కాంగ్రెసనే నిందిస్తోందని రేవంత్ ప్రస్తావించారు. బీజేపీ, బీఆర్ఎసలది ఫెవికాల్ బంధమని వ్యాఖ్యానించారు. వీళ్లిద్దరు సరే ఎంఐఎం కాంగ్రెసను ఎందుకు విమర్శిస్తోందో చెప్పాలని రేవంత్ ప్రశ్నించారు. సోనియాగాంధీ పదవులు త్యాగం చేసినందుకా? దళితుడిని జాతీయ అధ్యక్షుడిని చేసినందుకా? అని నిలదీశారు. దళిత మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రెస్‌మీట్‌లో కూర్చుంటేనే కేసీఆర్ సహించలేదని ప్రస్తావించారు.

మాదిగ వర్గానికి మంత్రివర్గంలో అసలు స్థానమే లేదని వ్యాఖ్యానించారు. దళితులకు, మైనార్టీలకు బీజేపీలోనూ గౌరవం లేదన్నారు. తనను తిట్టినా, పార్టీని తిట్టినా సహిస్తానని, సోనియాగాంధీని తిడితే మాత్రం ఒవైసీ సోదరులు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సోనియాను విమర్శించే నాయకులు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. తెలంగాణ ఎన్నికలు దేశ రాజకీయాలను మలుపు తిప్పే ఎన్నికలని రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. కేసీఆర్ మోదీకి ఏజెంటని వ్యాఖ్యానించారు.

వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని రేవంత్ పిలుపునిచ్చారు. డిసెంబరు నెలలో అద్భుతాలు జరుగుతాయని, 2009లో డిసెంబరు 9నే తెలంగాణ ప్రకటన వచ్చిందని, తాజాగా డిసెంబరులోనే తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బడి పిల్లలకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పేరుతో అల్పాహార పథకం ప్రారంభించిన అధికారపక్షం ముందు మధ్యాహ్న భోజన పథకంలో సమస్యలు పరిష్కరించాలని రేవంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన ఒక లేఖ రాశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు సక్రమంగా బిల్లుల చెల్లింపులు జరగట్లేదని, పాఠశాలల్లో వంటకు సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచడం లేదని చెప్పారు. మెనూలో మార్పులు చేస్తూ వంట కార్మికులకు ఆర్థిక భారం పెంచుతున్నారని వ్యాఖ్యానించారు. చెట్ల కింద వంటలతో భోజనం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని చెప్పారు. ఈ సమస్యపై సీఎం వెంటనే సమీక్ష జరపాలన్నారు.

**ప్రమాదంలో ప్రజాస్వామ్యం**

దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని కాంగ్రెస్ ముఖ్యనేత చిదంబరం అన్నారు. మీడియా మొదలుకొని అన్ని రంగాలపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మతపరమైన్ప స్వేచ్ఛ అణచివేతకు గురవుతోందన్నారు. మైనార్టీలు భయంతో బతుకుతున్నారని వ్యాఖ్యానించారు. పౌర హక్కులకు ప్రజాస్వామ్యం కవచం లాంటిదని, దాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. దేవుడికి తప్ప ఎవ్వరికీ భయపడొద్దని, హక్కుల కోసం రాజ్యాంగబద్ధంగా పోట్లాడాలని కోరారు. రాష్ట్ర విభజన జరిగిన వెంటనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే తెలంగాణ ఎన్నో రెట్ల అభివృద్ధి జరిగి ఉండేదని వ్యాఖ్యానించారు. ఇప్పుడు కేవలం ఒక కుటుంబానికి పరిమితం అయ్యిందని చెప్పారు. సీడబ్ల్యూసీ సమావేశం అనంతరం జరిగిన కాంగ్రెస్ నిర్వహించిన సభకు యువకులే ఎక్కువ మంది హాజరయ్యారని, రాష్ట్రంలో మార్పునకు ఇదే సంకేతమని చెప్పారు. దేశంలో ఉన్నత చదువులు చదివిన వారికి కూడా 40 శాతం మందికి ఉద్యోగాలు లేవని చిదంబరం ప్రస్తావించారు. గత ఇరవై నెలల్లో ధరలు ఆరు శాతం పెరిగాయని, దేశ చరిత్రలోనే ఇది అత్యధికమని చెప్పారు. సంపాదించినదంతా అప్పులకే సరిపోతోందని, పొదుపు అనేదే లేకుండా పోతోందని వ్యాఖ్యానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సమస్యలేవీ పట్టడం లేదన్నారు. మోదీ కేసీఆర్‌ను, కేసీఆర్ మోదీని తిట్టుకోవడమే తప్ప అసలు సమస్యలపై ఎవరూ మాట్లాడరని అన్నారు. మోదీ సర్కారులో మైనారిటీలు భయంతో బతుకుతున్నారని చిదంబరం వ్యాఖ్యా నించారు. కేంద్రంలో ఒకే ఒక క్రైస్తవ మంత్రి ఉన్నారని, సుప్రీంకోర్టులో ఒక్క క్రైస్తవ న్యాయమూర్తి కూడా లేరని ప్రస్తావించారు. క్రైస్తవ విద్యాసంస్థలకు విదేశాల నుంచి వచ్చే విరాళాలను బీజేపీ సర్కారు అడ్డుకుంటోందని, దేశంలో ప్రజాస్వామ్యం మెల్లగా తుడిచి పెట్టుకుపోతోందని చిదంబరం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి గండి పడితే మొదటి బాధితులు మైనారిటీలేనని హెచ్చరించారు. మైనారిటీలు భయపడకుండా హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ అంతటా

# కాంతితో క్రాంతి

(మొదటిపేజీ తరువాయి)

విగ్రహం ఎదుట చంద్రబాబుకు మద్దతుగా నిర్వహిస్తున్న దీక్షలకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంఘీభావం తెలిపారు. కాగా, మోతీనగర్‌కు చెందిన చంద్రబాబు అభిమాని శ్రీనివాస్ ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నం చేయగా.. అక్కడే ఉన్న నేతలు వారించారు. దీక్షా శిబిరంలో పాల్గొన్న ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం చంద్రబాబు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు.

అభివృద్ధి చేసిన వారిని జైలు పాలుచేసి, దొంగలు రాష్ట్రాన్ని ఏలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంతితో క్రాంతి కార్యక్రమంలో భాగంగా టీటీడీపీ నగర కార్యాలయంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. టీడీపీ నేతలు పి.సాయిబాబా, బాలరాజ్‌గౌడ్, కిశోర్ పాల్గొన్నారు. దిల్‌సుఖ్ నగర్‌లో టీడీపీ నేత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్ నగర్ నుంచి చైతన్యపురి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకురాలు నందమూరి సుహాసిని, పొలిట్ బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ సీబీఎన్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు తలారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో సంతకాల సేకరణ చేపట్టారు. తార్నాక డివిజన్ టీడీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో.. లాలాపేట్‌లోని వినోభానగర్‌లో ఐదు నిమిషాల పాటు విద్యుత్ లైట్లను ఆపేసి, కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. అంబర్‌పేట టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ ఆధ్వర్యంలో నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. చంద్రబాబుకు మద్దతుగా మణికొండలో మౌనదీక్ష నిర్వహించారు.

**'కాంతితో క్రాంతి'లో లోకేశ్**

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ పిలుపునిచ్చిన 'కాంతితో క్రాంతి' నిరసన కార్యక్రమంలో ఢిల్లీలో నారా లోకేశ్ పాల్గొన్నారు. టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ అధికారిక నివాసంలో రాత్రి 7 గంటలకు విద్యుత్తు దీపాలు ఆర్పివేసి పార్టీ శ్రేణులతో పాటు వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజుతో కలిసి లోకేశ్ కొవ్వొత్తులను ప్రదర్శించారు. ఏపీని కాపాడాలంటూ నినాదాలు చేశారు.

**సినీ ప్రముఖుల సంఘీభావం**

"ఆంధ్ర రాష్ట్రం అంధకారంలో ఉంది.. చంద్రుడు రావాలి.. వెలుగు తేవాలి" అని సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు ఆకాంక్షించారు. సేవ్ ఏపీ.. సేవ్ డెమోక్రసీ పేరుతో టీడీపీ నిర్వహించిన 'కాంతితో క్రాంతి'కి సంఘీభావం తెలుపుతూ తన నివాసంలో ఆయన కొవ్వొత్తులు వెలిగించారు. ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను సైతం తన బృందంతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి చంద్రబాబుకు మద్దతు ప్రకటించారు. తెలుగు మహిళా అధ్యక్షురాలు షకీలారెడ్డి ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహం వద్ద కాగడాలు వెలిగించి చంద్రబాబుకు సంఘీభావం తెలిపారు. ఎల్బీనగర్‌లో టీడీపీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాగజ్‌నగర్‌లో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి గొల్లపల్లి ఆనంద్, సిరిసిల్లలో ఆవునూరి దయాకర్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీలు చేపట్టారు. నిజామాబాద్ టీడీపీ నేతలు 11 రోజులుగా చేస్తున్న దీక్షలకు కాంగ్రెస్ నేత అరికెల నర్సారెడ్డి మద్దతు తెలిపారు. బోధన్‌లో ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 18వ రోజుకు చేరాయి. డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి)లో గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వర్నిలో చంద్రబాబును విడుదల చేయాలని కోరుతూ నాయీ బ్రాహ్మణులు రిలే దీక్షలు చేపట్టారు. ఏపీలో రాక్షస పాలన కొనసాగుతోం దనడానికి బాబు అరెస్టే నిదర్శనమని బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాసుల బాలరాజు పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు చోట్ల 'కాంతితో క్రాంతి' కార్యక్రమం నిర్వహించారు. భద్రా చలంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్య సంఘీభావం తెలిపారు. ఏపీలో చంద్రబాబును అరెస్టు చేస్తే తెలంగాణలో నిరసనలు చేయాల్సిన అవసరం ఏముందని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారని తెలిపారు.

# రేవంత్‌రెడ్డి..రేటెంతరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రధానంగా రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు. రేవంత్ ఆర్ఎసఎస్ మనిషని కాంగ్రెసలోని కొందరు సీనియర్ నేతలు ఏకంగా పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని మంత్రి ఆరోపించారు. గాడ్సే లాంటి రేవంత్‌రెడ్డి చేతికి గాంధీభవన్ పగ్గాలు అప్పగించారని వ్యాఖ్యానించారు. బీజేపీ ఉత్త మేకప్ వేసుకుని పోకడలు చేస్తుందని.. ఇక కాంగ్రెసకు ప్యాకప్ చెప్పే టైం వచ్చిందని ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీలు అమలు సాధ్యం కాని వాగ్దానాలతో ప్రజల ముందుకు వస్తున్నాయని, వాటిని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని వ్యాఖ్యానించారు.

కర్ణాటక నుంచి కాంగ్రెసకు, అదాని నుంచి బీజేపీకి ఎన్నికల ఫండ్ వస్తోందని ఆరోపించారు. ఆ డబ్బులకు మోసపోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని, తాము ఎవరికీ బీ టీం కాదని స్పష్టం చేశారు. ఢిల్లీ, గుజరాత్ పార్టీల దగ్గర మోకరిల్లే సన్నాసులు మనకు అవసరమా!? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెసది దింపుడు కల్లెం ఆశ అని, సచ్చిన పీనుగుతో సమానమని ఎద్దేవా చేశారు. దురదృష్టవశాత్తు బీఆర్ఎస్ ముదిరాజ్‌లకు అసెంబ్లీ సీట్లు ఇవ్వలేక పోయిందని కేటీఆర్ అన్నారు. కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా సాధ్యం కాలేదన్నారు. నామినేటెడ్ పదవుల్లో ప్రా?ధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. మహారాష్ట్ర ప్రజలు కేసీఆర్ వైపు చూస్తున్నారన్నారు. మహారాష్ట్రలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్‌లు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారని కేటీఆర్ తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ రికార్డు కొట్టబోతున్నాడని మంత్రి కేటీఆర్ జోస్యం చెప్పారు. కామారెడ్డిలో గెలుపుతో కేసీఆర్ దేశంలోని అనేక రికార్డులను తిరగరాస్తారని అన్నారు. మెజారిటీ లక్ష దాటాల్సిందేనన్నారు. ప్రతీ వంద ఓటర్లకు ఒక నేతను నియమిస్తామని, ఒక్కో బూత్‌కు సీనియర్ నాయకుడిని ఇన్‌చార్జిగా పెడతామని ప్రకటించారు. కేసీఆర్ పూర్వీకులది కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం కోనాపూర్ గ్రామమని గుర్తుచేశారు. కామారెడ్డి నేలను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా కేసీఆర్ కామారెడ్డికి వస్తున్నారన్నారు.

కేటీఆర్ పర్యటన సందర్భంగా ప్రతిపక్ష నేతల నుంచే కాకుండా ప్రజల నుంచీ నిరసనలు ఎదురయ్యాయి. సభలోనే పలువురు నిరసన నిరసన వ్యక్తం చేశారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లు రాని బాధిత మహిళలు, బీఎల్‌టీయూ నాయకులు డబుల్‌బెడ్‌రూం ఇవ్వాలంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ, వామపక్ష నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సభలో నిరసన తెలిపిన ఇద్దరు వ్యక్తులపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముకుమ్మడిగా దాడిచేసి గాయపరిచారు. కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టుజాహ్నవి ఆమె తండ్రి, సీనియర్ నేత నిట్టు వేణుగోపాల్‌రావు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఫొటోలు ఏర్పాటు చేయకపోవడంతో.. వీరి మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. అదే విధంగా సభా వేదికపై సైతం విప్ గంప గోవర్ధన్, నిట్టువేణుగోపాల్‌రావు పక్కపక్కనే కూర్చున్నా.. ఎడముఖం, పెడముఖంగానేఉన్నారు. దీంతోపాటు మంత్రి కేటీఆర్ ప్రసంగం ముగియగానే తోటి బీఆర్ఎస్ నేతలతో కాకుండా ముందు గానే మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, నిట్టువేణుగోపాల్‌రావు, ఆయన అనుచరులు వెళ్లిపోవడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## సంపాదకీయం

# మారుతున్న సినిమా కథలు

సినిమా కథలు మారుతున్నాయి. వ్యక్తిగత లక్ష్యం, స్నేహం, మానవ తావాదానికి చెందిన ఇతివృత్తం కలిగినదైనందువల్లనే 'ఆర్‌ఆర్‌ఆర్' ప్రపంచవ్యాప్తంగా అందరికీ చాలా సన్నిహితం అయ్యింది. ఉత్తర అమెరికాలో 1 మిలియన్ యూఎస్ డాలర్లు, ఆస్ట్రేలియాలో రెండున్నర లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు దాటి వసూలు చేసిన మొదటి కన్నడ చిత్రంగా 'కాంతార' సాధించిన అద్భుత విజయానికి దాని ఉద్వేగ భరితమైన నేటివిటీయే సహాయపడింది. గొప్ప నమ్మకంతో ఈ సినిమాను సృష్టించారు. పైగా మానవ భావోద్వేగాలు ప్రతిచోటా ఒకేలా ఉంటాయని మనకు గుర్తు చేస్తూనే, ఆ చిత్రం దాని సొంత నీతికి కట్టుబడి ఉంది. ప్రతి ధ్వనించే భావోద్వేగాలు, ప్రత్యేకమైన సాంస్కృతిక సందర్భం, ప్రపంచ స్థాయి టెక్నిక్‌ని కలిగి ఉన్నందున దక్షిణ భారత చిత్ర పరిశ్రమల కంటెంట్‌ని ప్రపంచవ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. గురుదేవులు రవీంద్రనాథ్ టాగూర్ ఒకసారి ఇలా అన్నారు: 'ఎవరూ ప్రపంచ భారాన్ని మరింతగా పెంచకూడదు, ప్రతి ఒక్కరూ దానిని తగ్గించడానికి ప్రయత్నించాలి.' ఈ భారాన్ని తగ్గించడానికి కథలు చెప్పడం ఉత్తమ మార్గం అని నేను భావిస్తున్నాను. భాషకు అతీతంగా మనల్ని కలిపే కథలు మనం ఒంటరిగా లేమని గుర్తుచేస్తాయి. పైగా అవి మన భావోద్వేగాలను తిరుగులేని విధంగా ప్రభావితం చేస్తాయి. జపనీస్ రచయిత అకిరా కురసోవా తీసిన 1954 క్లాసిక్ చిత్రం, 'ది సెవెన్ సమురాయ్స్'ని తీసుకోండి. దీన్ని దాదాపు ప్రతి భాషలోనూ రీమేక్ చేశారు. దాని ఇంగ్లీష్ వెర్షన్ 1960లో జాన్ స్టర్జెస్ తీసిన 'ది మాగ్నిఫిసెంట్ 7', హిందీ వెర్షన్ 1975లో 'షోలే'. విజయ్‌టెండూల్కర్ రాసిన 'గిధాడే', 'శాంతత! కోర్ట్ చాలూ ఆహే', 'సఖారం బైండర్', 'కమలా', 'మిత్రాచి గోష్టా' వంటి మరాఠీ నాటకాలను వివిధ భాషల్లోకి అనువదించారు. వీటిలో చాలా నాటకాలు ఇప్పుడు 'జీ థియేటర్'లో హిందీలో అందుబాటులో ఉన్నాయి. కొన్నేళ్లుగా, భారతీయ వినోద పరిశ్రమ మంచి కథా కథనాలపై దృష్టి సారించినందుకు నేను సంతోషిస్తున్నాను. థియేటర్ అయినా, సినిమా అయినా, ఓటీటీ అయినా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ కంటెంట్ ప్రభావాన్ని మనం చూస్తున్నాం. దక్షిణ కొరియా, స్పెయిన్, ఫ్రాన్స్, అర్జెంటీనా, జపాన్, జర్మనీ వంటి అనేక ఇతర దేశాల నుండి కథలు ఇప్పుడు సులభంగా అందుబాటులో ఉంటున్నాయి. అలాగే మన కథకులు కూడా ఇంతవరకు ఎవరూ చెప్పని కథలతో ప్రయోగాలు చేస్తున్నారు. ఇప్పటికే సుపరిచితమైన కథనాలను కూడా తిరిగి ఆవిష్కరిస్తున్నారు. డబ్బింగ్, సబ్‌టైటిలింగ్‌ల ద్వారా కథల పరిధిని విస్తరిస్తున్నారు. సాంస్కృతికంగా సున్నితమై నవీ, సందర్భోచితమైనవీ అయిన ఉపశీర్షికలూ; సంభాషణకు చెందిన సారాంశాన్ని సంగ్రహించేలా, రెండు భాషల సూక్ష్మ నైపుణ్యాలను పుణికిపుచ్చుకున్న మంచి అనువా దకులు, ట్రాన్‌స్క్రైబర్లు ఇందుకు ఎంతో అవసరమనేది ఈ సందర్భంగా గమనార్హం. థియేటర్ గురించి చెప్పాలంటే, ఇది కూడా మౌఖిక సంప్రదాయాల నుండి వీధి ప్రదర్శనలు, ప్రోసినియం ప్రదర్శనలతోపాటు, ముఖ్యంగా టెలివిజన్ ప్రేక్షకుల కోసం రూపొందించిన టెలిప్లేల వరకు అభివృద్ధి చెందింది. ఇవి ఇప్పుడు భాషా సరిహద్దులను దాటి విస్తృత శ్రేణి థీమ్‌లను, పాత్రలను సృష్టిస్తున్నాయి. మనం అలాంటి సృజనాత్మక ప్రకంపనల కాలంలో జీవి స్తున్నందుకూ; నా టెలిప్లేలలో ఒకటైన 'మా రిటైర్ హోతీ హై' ఇప్పుడు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రేక్షకులకు కన్నడ, తెలుగు భాషలలో అందుబాటులో ఉన్నందుకూ నేను ఎంతో పులకరించి పోతున్నానుమంచి కథలలోని మరొక ముఖ్య అంశం ఏమిటంటే ? అవి ఆలోచనలను రేకెత్తిస్తాయి. చాలా సూక్ష్మంగా సామాజిక మార్పును ఉత్కృష్ట స్థాయిలో ప్రారంభిస్తాయి. ఉదాహరణకు ? స్వలింగ సంబంధాలు, లింగ పరమైన రాజకీయాలతో సహా అనేక సామాజిక సమస్యల గురించి మన ఆలోచనలను సరిదిద్దుకునేలా చేయడంలో చేతన్ దత్తర్, విజయ్ టెండూల్కర్ వంటి నాటక రచయితల రచనలు సహాయపడ్డాయి. టెండూల్కర్ రాసిన 'కమలా'ను చలనచిత్రంగా రూపొందించినప్పుడు సాధారణ స్త్రీల, మరీ ముఖ్యంగా గిరిజన స్త్రీల గౌరవం గురించి తీవ్రమైన సామాజిక చర్చ రేకెత్తింది. కంటెంట్‌కు టెక్నిక్ సహాయం చేసినమాట నిజమే అయినా, కొత్త బాధ్యతలవైపు మారడానికీ, సమస్యల ప్రపంచంలో వారి స్థానం గురించి కొత్తగా ఆలోచించడానికీ ప్రజలను ప్రేరేపించే కథనాలు ఇప్పటికీ అవసరమే. భారతదేశంలో అటువంటి సుసంపన్నమైన కథనాలకు ఎన్నడూ కొరత లేదు. అవి అపారమైన సాంస్కృతిక, భౌగోళిక వైవిధ్యం నుండి ఉద్భవించినప్పటికీ వాటికి మనల్ని కదిలించే, తరలించే శక్తి ఉంది. మనల్ని కలిసికట్టుగా నవ్వుతూ, దుఃఖిస్తూ జీవితాన్ని ఆస్వాదింప చేస్తాయి.

### ప్రతిపక్షాల దిమ్మతిరిగేలా

# బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో

**- మంచిర్యాల జిల్లా పర్యటనలో మంత్రి హరీశ్‌రావు**

**హాజీపూర్-ప్రభాతసూర్యుడు:** బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నడ్డి విరిచే ఎన్నికల ప్రణాళిక మా దగ్గర ఉందని వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రతిపక్షాల దిమ్మతిరిగేలా బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ఉంటుందని చెప్పారు. దానిపైనే సీఎం కేసీఆర్ సుదీర్ఘ సమాలోచనలు చేస్తున్నారని తెలిపారు. శనివారం మంచిర్యాల జిల్లా చెన్నూర్, హాజీపూర్ మండలాల్లో పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో ఆయన మాట్లాడారు. సొంత రాష్ట్రంలోనే బీజేపీని గెలిపించుకోలేని నడ్డా ఆటలు ఇక్కడ సాగవన్నారు. డిపాజిట్లు దక్కించుకునే కమిటీ వేసుకుంటే కనీసం పరువైనా దక్కుతుందని విమర్శించారు. బీజేపీ చేరికల కమిటీ అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. రాష్ట్రంలో హంగ్ ఏర్పడదని బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ కొడుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ డకౌట్.. బీజేపీ రన్‌ఔట్ అవుతాయని.. బీఆర్‌ఎస్ మాత్రం సెంచరీ కొడుతుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో డిపాజిట్లు దక్కవన్నారు. రేవంత్‌రెడ్డి మారని పార్టీ లేదని, అలాంటి వ్యక్తిని ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. వృద్ధాప్య పింఛన్ పెంచే ఆలోచనలో సీఎం కేసీఆర్ ఉన్నారని చెప్పారు. ప్రాణహిత, గోదావరి నదుల తీర ప్రాంతాల్లో కరకట్టలు నిర్మించి.. మునిగిపోయిన పంట పొలాలను రీసర్వే చేయించి రైతులకు నష్టపరిహారం అందించే ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు.

# ఇక మహిళా లోకానికి మంచిరోజులు

(మొదటిపేజీ తరువాయి)
కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం చేశారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళల కోటా కోసం తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ కోసం సాగిన పోరాటంలో సీపీఐ(ఎం), సీపీఐ, ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) కీలక పాత్ర పోషించాయని కవిత గుర్తుచేశారు. మహిళా బిల్లు కోసం 1990ల్లోనే తన నియోజకవర్గం నిజామాబాద్‌లోనే కాకుండా అనేక ప్రాంతాల్లో ధర్నాలు జరిగినా అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదని తెలిపారు. 1996లో దేవేగౌడ ప్రభుత్వం నుంచి మహిళా బిల్లు కోసం ప్రయత్నాలు జరిగాయనీ, 2010లో సోనియా గాంధీ, 2023లో ప్రధాని నరేంద్ర మోడీ కీలకంగా వ్యవహరించారని చెప్పారు. ఈ బిల్లు ఆమోదంలో సీఎం కేసీఆర్ కీలక పాత్ర పోషించారనీ, రాష్ట్రం ఏర్పడిన తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే మహిళా బిల్లు పార్లమెంటు ఆమోదించాలని తీర్మానం చేయించి కేంద్రానికి పంపించారని గుర్తుచేశారు.

దేశ చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లను సాధించడంలో కీలక పాత్ర పోషించిన కల్వకుంట్ల కవితకు లండన్‌లో ప్రశంసలు వెల్లువెత్తాయి. చట్టసభల్లో అత్యల్పంగా ఉన్న మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచడానికి కవిత కృషి చేశారని వక్తలు కొనియాడారు. మహిళా రిజర్వేషన్లపై కల్వకుంట్ల కవిత చేసిన కృషిపై బ్రిడ్జ్ ఇండియా సంస్థ ప్రదర్శించిన వీడియో సభికులను ఆకట్టుకుంది. 2014లో మొట్టమొదటి సారిగా కొత్తగా ఏర్పడిన తెలంగాణ నుంచి పార్లమెంటుకు ఎన్నికైన కవిత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకత్వంలో మహిళా సాధికారత కోసం పనిచేశారని ఆ సంస్థ తెలిపింది. మానవ సమాజంలో పురుషుల ఆధిపత్యం ఎందుకు పెరిగింది ? ఎందుకు మహిళలను అణచివేయాలన్న ఆలోచనలు వచ్చాయి ? కేవలం మానువుల్లోనే ఎందుకు ఇలా జరిగింది ? సహచర మనిషిని ఎలా అణగదొక్కుతారు ? ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మహిళల నుంచి ఎన్నో ఎలా ఆశిస్తారు ? వంటి సీరియస్ ప్రశ్నల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.

సమస్య లోతుల్లోకి వెళ్లి పరిష్కారాలు కనుక్కోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఆరోగ్యంపై పరిశోధనలు పెరగాలనీ, స్టార్టప్ కంపెనీల్లో మహిళలకు ఆర్థిక సాయం అందడం లేదనీ, ఈ పరిస్థితి రాజకీయవేత్తలందరూ దోషులేనని విమర్శించారు.

# నకిలీ సర్టిఫికెట్ల గోల్ మాల్

(మొదటిపేజీ తరువాయి)
గుర్తించారు. విజయవాడలో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న నాగేశ్వరరావు ఈ అక్రమాలకు ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. విద్యార్థులతో పాటు నిర్వాహకుడిపై వరంగల్ మట్టెవాడ పిఎస్‌లో కేసు నమోదైంది. కాళోజీ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఎంబిబిఎస్,బిడిఎస్ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కాళోజీ వర్శిటీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ క్రమంలో ఎంబిబిఎస్ సీట్లు వచ్చిన ఏడుగురు విద్యార్థులు సమర్పించిన పత్రాలపై వర్శిటీ అధికారులకు అనుమానం రావడంతో దర్యాప్తు జరిపారు. విద్యార్థులు ఆరు నుంచి 9వ తరగతి వరకు తెలంగాణ రాష్ట్రంలో చదువుకున్నట్లు పత్రాలు సమర్పించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా వీరికి లోకల్ కోటలో సీట్లను కేటాయించారు. విద్యార్థులు పదోతరగతితో పాటు ఇంటర్ ఆంధ్రప్రదేశ్‌లో చదువుకున్నారు. నీట్ పరీక్షను కూడా విజయవాడలోనే రాశారు. వీరిని అనుమానించిన యూనివర్శిటీ అధికారులు ఒరిజినల్ పత్రాలతో నేరుగా వర్శిటీలో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని ఆదేశించారు. విద్యార్థులు తమ తరపున కన్సల్టెన్సీ నిర్వాహకుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాడని వెల్లడించారు. కామిరెడ్డి నాగేశ్వరరావు తమ తరపున ధృవపత్రాలను అప్‌లోడ్ చేసినట్లు చెప్పడంతో ఆ ధృవపత్రాలను నకిలీగా తేల్చిన యూనివర్శిటీ అధికారులు విద్యార్థులతో పాటు నిర్వాహకుడిపై ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. ఏపీలో చదువుకున్న విద్యార్థికి తెలంగాణలో స్థానిక ధృవీకరణ ఏ ప్రాతిపదికన ఇచ్చారో వివరణ ఇవ్వాలంటూ అలంపూర్ తహసీల్దార్‌కు తెలంగాణ హైకోర్టు ఆదేశించింది.

మెడికల్ సీట్ల భర్తీలో 85శాతం స్థానిక కోటా విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులను ఇప్పటికే హైకోర్టు సమర్థించింది. స్థానికత విషయంలో మాత్రం సడలింపులు ఇచ్చింది. ఈ క్రమంలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు కర్నూలులో, ఇంటర్‌ను కృష్ణా జిల్లాలో చదివిన ఓ విద్యార్థినికి మెడికల్ అడ్మిషన్ నిమిత్తం అలంపూర్‌లో 18 ఏళ్లుగా నివాసం ఉంటున్నట్లు ధ్రువీకరణ పత్రం జారీ చేయడాన్ని తెలంగాణ హైకోర్టు తప్పుబట్టింది. ధ్రువపత్రం ఇవ్వడానికి కారణాలపై రెండు వారాల్లో వివరణ ఇవ్వాలంటూ అలంపూర్ ఎమ్మార్వోకు ఆదేశాలు జారీ చేస్తూ విచారణను అక్టోబరు 31కి వాయిదా వేసింది. మెడికల్ అడ్మిషన్లకు సంబంధించిన నిబంధనపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం నివాస ధ్రువీకరణపత్రం సమర్పించినా తన వినతిపత్రాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ జోగులాంబ-గద్వాల జిల్లా అలంపూర్‌కు చెందిన సింగోటం వెన్నెల హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం నివాస ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించినా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్ ప్రక్రియలో స్థానిక కోటా కింద కాళోజీ యూనివర్సిటీ పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్ పేర్కొన్నారు.

తన వినతిపత్రాన్ని తిరస్కరిస్తూ యూనివర్సిటీ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసి అడ్మిషన్ ఇచ్చేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. యూనివర్శిటీ వాదనలను విన్న ధర్మాసనం ఏపీలో చదివిన విద్యార్థినికి నివాస ధ్రువీకరణ పత్రాన్ని ఏ ప్రాతిపదికన ఇచ్చారో, ఏ ప్రాతిపదికన ధృవీకరణ మంజూరు చేశారో వివరణ ఇవ్వాలంటూ అలంపూర్ ఎమ్మార్వోను ఆదేశించింది. తెలంగాణ స్థానికత కలిగి, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారికి స్థానికత విషయంలో రెవిన్యూ అధికారులు విచారణ తర్వాత ధృవీకరణలు మంజూరు చేయాలని తెలంగాణ హైకోర్టు గత నెలలో ఆదేశించింది.

# గ్రీన్ హైడ్రోజన్ దిశగా సింగరేణి

**కరీంనగర్ - ప్రభాత సూర్యుడు :** దేశంలో సోలార్ విద్యుత్తు రంగంలోకి అడుగుపెట్టిన తొలి బొగ్గు కంపెనీగా పేరు తెచ్చుకున్న సింగరేణి కాలరీస్ మరో భారీ పర్యావరణహిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. సింగరేణి నిర్వాహణలో ఉన్న ప్రస్తుత హైడ్రోజన్ ప్లాంటును గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ గా మార్చాలని నిర్ణయించారు. దేశంలో సోలార్ విద్యుత్తు రంగంలోకి అడుగుపెట్టిన తొలి బొగ్గు కంపెనీగా పేరు తెచ్చుకున్న సింగరేణి కాలరీస్ మరో భారీ పర్యావరణహిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. సింగరేణి నిర్వాహణలో ఉన్న ప్రస్తుత హైడ్రోజన్ ప్లాంటును గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ గా మార్చనున్నారు. స్వీయ నిర్వహణలో పెద్దపల్లి జిల్లా రామగుండం రీజియన్‌లో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఇప్పటికే సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్. శ్రీధర్ విద్యుత్ విభాగ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రతి పరిశ్రమ పర్యావరణ స్పృహతో ఉత్పత్తులు సాధించేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే 224 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను పర్యావరణ హితంగా నిర్వహిస్తున్న సింగరేణి, పర్యావరణ హిత హైడ్రోజన్ ను కూడా ఉత్పత్తి చేయాలని ఛైర్మెన్ సూచించారు. 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర వినియోగానికి అవసరమైన హైడ్రోజన్ ను ఇకపై సోలార్ విద్యుత్తు ను వినియోగిస్తూ ఉత్పత్తి చేయాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను ప్రస్తుత ప్లాంటు లో తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అలాగే మరో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని కోరారు.

**గ్రీన్ హైడ్రోజన్ వాడే తొలి పవర్ స్టేషన్ సింగరేణి**

దేశం లో గ్రీన్ హైడ్రోజన్ వాడే తొలి పవర్ స్టేషన్ కానున్న సింగరేణి సాధారణంగా హైడ్రోజన్ వాయువు ఉత్పత్తిని థర్మల్ విద్యుత్ వినియోగించి ఎలక్ట్రాలసిస్ రసాయనిక పద్ధతి లో ఉత్పత్తి చేస్తుంటారు. ఈ ప్రక్రియలో థర్మల్ విద్యుత్తు కు బదులు సోలార్ విద్యుత్ వినియోగించి ఉత్పత్తి చేసే హైడ్రోజన్ ను 'గ్రీన్ హైడ్రోజన్' గా పేర్కొంటున్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో గల రెండు 600 మెగావాట్ల జనరేటర్ ల లో వేడిమిని తగ్గించడం కోసం శీతలీకరణ ధాతువుగా హైడ్రోజన్ ను వినియోగిస్తున్నారు. దీనికోసం ప్లాంట్ ఆవరణలోనే ఒక హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏడాదికి దాదాపు 10 వేల క్యూబిక్ మీటర్ల హైడ్రోజన్ వాయువును ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి చేసి వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్లాంట్ 100 కిలో వాట్ విద్యుత్తును వినియోగిస్తూ హైడ్రోజన్ వాయువు ను ఉత్పత్తి చేస్తుంది. ఈ నేపథ్యంలో పర్యావరణహిత చర్యగా ప్లాంటును ఇకపై సోలార్ విద్యుత్తు వినియోగం ద్వారా నిర్వహించాలని, తద్వారా గ్రీన్



హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తూ, దానిని వినియోగిస్తున్న తొలి థర్మల్ విద్యుత్ కేంద్రంగా దేశంలో నిలవాలని సింగరేణి సంస్థ భావించింది. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర ప్రాంగణంలోనే ప్రస్తుతం 10మెగావాట్ల సోలార్ విద్యుత్ కేంద్రం మరియు 5మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు ఉన్నాయి. అక్కడి నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్తును ప్రస్తుత హైడ్రోజన్ ప్లాంటుకు వినియోగించు కునేందుకు పూర్తి అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పర్యావరణహిత చర్యగా మరో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ను కూడా రామగుండం రీజియన్ లో సింగరేణి సోలార్ ప్లాంట్లు గల ప్రాంతంలో ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించవలసిందిగా ఆదేశాలు జారీచేశారు. గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటును సింగరేణి ఏర్పాటు చేస్తే ఈ హైడ్రోజన్ వాయువును సింగరేణి తో పాటు సమీపంలోని ఎరువుల కర్మాగారాలకు ఇతర కర్మాగారాలు కూడా విక్రయించే అవకాశం ఉంది. లాభాల కన్నా ఒక మంచి పర్యావరణ హిత చర్యగా ఈ ప్రాజెక్ట్ ను చేపట్టాలని కంపెనీ భావిస్తుందని సంస్థ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలల కాలంలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న సోలార్ ప్లాంట్ల ద్వారా 170 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యింది. తద్వారా సింగరేణి సంస్థ తెలంగాణ ట్రాన్స్ కో కు చెల్లించే విద్యుత్ బిల్లులో 108 కోట్ల రూపాయలను ఆదా చేసుకోగలిగిందని సింగరేణి డైరెక్టర్ ఈ అండ్ ఎం, డి.సత్యనారాయణ రావు తెలిపారు...ఇంకా నిర్మాణంలో ఉన్న 76 మెగా వాట్ల సోలార్ ప్లాంట్లను డిసెంబర్ నాటికల్లా పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.

# ఇక ఆర్‌బీఐలోనే రూ.2వేల నోట్ల మార్పిడి

**బ్యాంక్‌ల్లో ముగిసిన గడువు**

**న్యూఢిల్లీ :** బ్యాంక్‌ల్లో రూ.2,000 నోట్ల మార్పిడికి శనివారంతో గడువు ముగిసింది. ఇకపై ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లోనే పెద్ద నోట్ల మార్పిడికి అవకాశం ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేసింది. ఇంకా మార్కెట్‌లో రూ.12వేల కోట్ల విలువ చేసే రూ.2,000 నోట్లు చెలామణిలో ఉన్నాయి. అవి ఇంకా బ్యాంకులకు చేరలేదు. తొలుత సెప్టెంబర్ 30 వరకూ రూ.2000 నోట్ మార్పిడి లేదా డిపాజిట్‌కు అవకాశం ఇచ్చిన రిజర్వ్ బ్యాంక్ తర్వాత ఆ గడువును ఈ నెల అక్టోబర్ ఏడో తేది వరకు పొడిగించింది. సోమవారం నుంచి ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాల వద్ద మాత్రమే మార్చుకునేందుకు వీలు ఉంది. దేశ వ్యాప్తంగా ఆర్‌బీఐకి 19 ప్రాంతీయ కార్యాలయాల్లో ఒకేసారి రూ.20 వేల వరకూ డిపాజిట్ లేదా మార్పిడి చేసుకోవచ్చు. వీలు కాని వారు పోస్టాఫీసుల ద్వారా కూడా ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాలకు రూ.2000 నోట్లు పంపడానికి వీలు కల్పించింది. అనంతరం ఆ మొత్తం ఖాతాదారుల బ్యాంక్ ఎకౌంట్‌లో డిపాజిట్ అవుతుంది.



చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషన్ రెడ్డి

### తుర్కయంజాల్‌లో వైభవంగా
## చందనా బ్రదర్స్ షాపింగ్ మాల్ ప్రారంభం

**- ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**
**- సినీ నటి అను ఇమ్మాన్యుయేల్**



చందనా బ్రదర్స్ నూతన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సునీతార అను ఇమ్మానుయేల్

తుర్కయంజాల్ – ప్రభాత సూర్యుడు : తుర్కయంజాల్ మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన చందన బ్రదర్స్ షాపింగ్ మాల్‌ను ప్రముఖ సినీ నటి అను ఇమ్మాన్యుయేల్ తో కలిసి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చేరువగా ఇలాంటి షాపింగ్ మాల్స్ అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమని అన్నారు. ఇలాంటి షాపింగ్ మాల్స్ ఏర్పాటు వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని, ప్రాంతాలు కూడా అభివృద్ధి దిశగా దూసుకు పోతాయని పేర్కొన్నారు.

### వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన
## జడ్పీటీసి మర్రి నిత్యా నిరంజన్ రెడ్డి

**- 5 లక్షల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్**
**- పొదుపు సంఘం భవనం కొరకు 10 లక్ష రూపాయలు**



మంచాల – ప్రభాత సూర్యుడు :

మంచాల మండల కేంద్రం మంచాల గ్రామంలో (జెడ్పీటిసి) జిల్లా పరిషత్ నిధుల నుండి డ్వాక్రా బిల్డింగ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన మరియు మనో వికాస సంకల్ప కేంద్రం ప్రహరి గోడ నిర్మాణా పనులకు శంకుస్థాపన, 5 లక్షల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ గ్రామపంచాయతీ నిధులతో, మహిళా పొదుపు సంఘం భవనం నిర్మాణం కొరకు 10 లక్షలు, బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జడ్పీటిసి మర్రి నిత్య నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ మంచాల మండలాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు, రానున్న రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు, ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్మద, సర్పంచ్ జగన్ రెడ్డి, ఎంపీటీసీ నరేందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు బాలరాజ్, వార్డ్ మెంబర్ లింగం గౌడ్, మరియు వార్డ్ మెంబర్లు, పంచాయతీ సెక్రెటరీ రాజ్ కుమార్, సీసీలు, ఏపీఎం ,వివిధ శాఖల అధికారులు ,సిబ్బంది, గ్రామస్తులు ,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పలు ప్రాంతాల్లో మూడవరోజు కొనసాగుతున్న ఐటీ సోదాలు

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు :

హైదరాబాద్ నగరంలో మూడవ రోజు శనివారం ఐటి అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. పలు చిట్ఫండ్స్, ఫైనాన్స్ సంస్థలపై ఈ సోదాలు జరుగుతున్నాయి. అమీర్పేట్, కూకట్పల్లి శంషాబాద్లో ఐటి అధికారులు సోదాలు నిర్వహించారు.

పూజ కృష్ణ ఎండీ కృష్ణ ప్రసాద్ ఇల్లు ఆఫీసులతో పాటు శంషాబాద్ రఘువీర్ ఇల్లు, ఇందు ఫార్చ్యూన్ సంస్థలపై సోదాలు జరుగుతున్నాయి. ఆదాయ పన్ను చెల్లించకుండా ఎగవేశారని.. పెట్టుబడులను రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టారనే ఆరోపణల్లో భాగంగా ఆయా సంస్థలపై ఐటీ అధికారులు తనిఖీలచే చేస్తున్నారు. ఇప్పటికే కీలకమైన డాక్యుమెంట్లను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

# మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం

**- మన్సురాబద్ డివిజన్ ఈస్ట్ కాలనీల ఆత్మీయ సమ్మేళనం**
**- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**






హయత్ నగర్ – ప్రభాత సూర్యుడు :

రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీనే విజయం సాధిస్తుందని, మళ్లీ బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం పక్కా అని ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హయత్ నగర్ డివిజన్ పరిధిలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మన్సురాబాద్ డివిజన్ ఈస్ట్ కాలనీల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిలో భాగమై నియోజకవర్గ పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉన్నటువంటి 974 కాలనీలలో 365 రోజులు ప్రతినిత్యం కాలనీలన్నింటినికి అందుబాటులో ఉంటున్నానని అన్నారు. ప్రతి కాలనీలో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. డివిజన్ పరిధిలో కొత్తగా 4 కోట్లు రూపాయలతో ట్రంక్ లైన్స్ ఏర్పాటు చేశాము అని తెలిపారు. రాష్ట్రంలోనే అతిపెద్ద నియోజకవర్గమైనటువంటి ఎల్బీనగర్ నియోజకవర్గం కొనియాడారు.అలాగే నాగోల్ లో మరొక మురికీ నీటి శుద్ధి కేంద్రం ఎర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటివరకు ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో సుమారు 3000 కోట్లతో అభివృద్ధి చేశామని, రాబోయే రోజుల్లో మరిన్ని అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. గతంలో మాదిరిగానే వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ తెరాస పార్టీ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, ఎల్.బి.నగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు కొసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి, జక్కిడి రఘువీర్ రెడ్డి, నరహరి శెట్టి సుమంత్, ఆనంద్ యాదవ్, రామాచారి, రాంకోటి మరియు నాయకులు, కార్యకర్తలు పలు కాలనీల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# అదిలాబాద్ జిల్లాలో పదికి పది గెలుస్తాం

**- మంత్రి హరీష్ రావు**



మంచిర్యాల – ప్రభాత సూర్యుడు : మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం లో 1 టీఎంసీ సామర్థ్యం గల రూ.80 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మించనున్న పడ్తన్ పల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు ఆర్థిక, వైద్య, ఆరోగ్య ఎ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి హరీష్ రావు భూమి పూజ, శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో భారాస జిల్లా అధ్యక్షులు ప్రభుత్వ విప్ చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎంపి వెంకటేష్ నేత, ఎమ్మెల్యేలు దివాకర్ రావు, చిన్నయ్య, ఎమ్మెల్సి దండే విఠల్ తదితరులు పాల్గోన్నారు. మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ రెండు పంటలు పక్కగా పండుతాయి. హాజీపుర్, లక్షెట్ట్ పేట్ నీళ్ళు కొరత ఉండదు.30 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ , వైఎస్ జిల్లా చేస్తా అని మాట తప్పను. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చింది. కేసీఅర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, గృహ లక్ష్మి, కళ్యాణ లక్ష్మి ఇలా అనేక కార్యక్రమాలు చేస్తున్నాం. పదేళ్లలో ఎంతో అభివృద్ధి. తెలంగాణ ఆచరిస్తది దేశం అనుసరిస్తది. 24 గంటలు ప్రజల మధ్య ఉండే ఎమ్మెల్యే దివాకర్ రావు. బ్యాంకులు లూటీ చేసిన వాళ్ళు, గుండాలు మంచిర్యాల వస్తున్నారు. కాట క్లబ్బులు, మోసాలు చేసిన వాళ్ళు తయారు అవుతున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా బి ఆర్ ఎస్ మూడోసారి వస్తుంది. నేను హాజీపూర్ అల్లుడిని. మంచిర్యాల అభివృద్ధికి నా వంతు కూడా కృషి చేస్తా. మేనిఫెస్టో వస్తుంది. అది వస్తే ప్రతిపక్షాల దిమ్మ తిరుగుతుంది. కాంగ్రెస్ అంటే మాటలు, మూటలు, మంటలు. సీఎం కుర్చీ కోసం మతం మంటలు రేపిన పార్టీ కాంగ్రెస్. నక్సలైట్లతో చర్చలు అని వారిని మట్టు బెట్టింది కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ పార్టీ భస్మాసుర హస్తం. నడ్డా.. ఇది కేసీఅర్ గడ్డ. సొంత రాష్ట్రంలో హిమాచల్ ప్రదేశ్ లో పార్టీ గెలుపించుకొలేదు. ఇక్కడ వచ్చి నువ్వు చేసేది ఏమి లేదు. మిస్టర్ బి ఎల్ సంతోష్ తెలంగాణలో వచ్చేది హంగ్ కాదు, బి ఆర్ ఎస్ హ్యాట్రిక్. బిజెపి డిపాజిట్ల కమిటీ వేసుకుంటే మంచిది. అదిలాబాద్ జిల్లాలో పదికి పది గెలుస్తామని అన్నారు.

### ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో
## అభివృద్ధి పనుల పండుగ జాతర

**- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**
**-12 గంటల పర్యటనతో అభివృద్ధి పనులకు శ్రీకారం**
**-3.5 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు**



ఇబ్రహీంపట్నం:-ప్రభాత సూర్యుడు :

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని వివిధ గ్రామాలలో సుమారు 12గంటల పర్యటనతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి. మండలంలోని పోచారం, రాయపోల్, ముక్కునూర్, దండుమైలారం, నెర్రపల్లి, పోల్కంపల్లి మరియు నాగన్ పల్లి గ్రామాల్లో సుమారు 12గంటలపాటు పర్యటించి, 3.5కోట్ల రూపాయల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో మహిళలకు కేసీఆర్ పంపిన బతుకమ్మ చీరలను క్రీడాకారులకు పంపిన కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను ఎమ్మెల్యే కిషన్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డి , ఎంపీపీ కృపేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య , మాజీ జెడ్పీటిసి మైపాల్ ,బి ఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలకల బుగ్గ రాములు, యూత్ విభాగం అధ్యక్షులు జెర్కోని రాజు, యాచారం రవీందర్ , వివిధ గ్రామాల సర్పంచులు , ఉప సర్పంచులు ఎంపిటిసిలు బి ఆర్ఎస్ పార్టీ నాయకులు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

### కానిస్టేబుల్లు గా ఎంపికైన
## యువకులకు సన్మానం

కమాన్ పూర్ – ప్రభాత సూర్యుడు :

పాలకుర్తి మండలం కన్నాలకు చెందిన రమీజ్ తో పాటు మరో ముగ్గురు సివిల్ కానిస్టేబుల్‌గా ఎన్నిక కాగా శుక్రవారం ఘనంగా సన్మానించారు. కన్నాల మసీదు కమిటీ మరియు ఉప సర్పంచ్ పుట్ట రంజిత్ ఆధ్వర్యంలో రమీజ్ ను ముస్లిం సోదరులు ఘనంగా సన్మానించారు. కన్నాల జామియా మసీదులో సివిల్ కానిస్టేబుల్ గా ఎన్నికైన డిష్ ఖదీర్ కుమారుడు రమీజ్ ను మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ఇమామే జామియా కట్టి పూల మాల వేసి శాలువాతో సన్మానించారు. స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంతో కష్టపడి చదివి నిరంతర కృషి తో లక్ష్యాన్ని సాధించి సివిల్ కానిస్టేబుల్ గా ఎన్నికైన రమీజ్ ను ముస్లిం సోదరులు ,గ్రామ ప్రజలు అభినందించారు. యువకులు రమీజ్ ను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యోగాలు సాధించాలని పలువురు కోరారు. కన్నాల ఉపసర్పంచ్ పుట్ట. రంజిత్ మరియు ఎంఎ జిమ్ ఓనర్ అఫ్రోజ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కన్నాల చెందిన నలుగురు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన యువకులను కన్నాల ఉపసర్పంచ్ పుట్ట. రంజిత్ సన్మానించారు. ఉమ్మడి కన్నాలకు చెందిన కానిస్టేబుల్ కు సెలెక్ట్ అయిన నలుగురు యువకులను రెడ్డిరాజుల. నరేష్, రమీజ్,ఇస్లావత్. శ్యాంలాల్ ,ఇస్లావత్.శ్రావణ్, లను కన్నాల ఉప సర్పంచ్ పుట్ట. రంజిత్ మరియు అఫ్రోజ్ ఈ కార్యక్రమంలో ఉమ్మడి కన్నాల యువకులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215